

వీడిన ఉత్కంఠ



కేశినేని చిన్నికి స్వీట్లు తినిపిస్తున్న మహిళలు



కేశినేని చిన్ని కార్యాలయం వద్ద మహిళల సంబరాలు

ఉత్కంఠకు తెరపడింది. ఉత్సుకత వీడింది. ఎట్టకేలకు మైలవరం, పెనమలూరు టీడీపీ అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. ఇన్నాళ్లూ టెన్షన్ పెట్టిన పెనమలూరు బంతి చివరికి బోడె ప్రసాద్ కోర్టులోకే చేరింది. ఇక మైలవరం సస్పెన్స్‌కు కూడా తెరదించుతూ వసంత కృష్ణప్రసాద్ పేరు ఖరారైంది. ఇక మొదటి నుంచీ అనుకున్నట్టుగానే విజయవాడ పార్లమెంట్ స్థానానికి కేశినేని శివనాథ్ (చిన్ని) పేరును ఖరారు చేస్తూ అధిష్ఠానం శుక్రవారం జాబితా విడుదల చేయడంతో జిల్లా టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

టీడీపీ రెండో జాబితా విడుదలతో సస్పెన్స్‌కు తెర

- పెనమలూరు బరిలో బోడె ప్రసాద్..
- మైలవరం అభ్యర్థిగా వసంత పేరు ఖరారు
- విజయవాడ పార్లమెంట్ స్థానానికి కేశినేని చిన్ని
- దేవినేని ఉమా, బుద్ధప్రసాద్‌కు దక్కని చోటు
- అధికారంలోకి వచ్చాక సముచిత స్థానాలు
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అసెంబ్లీ, ఎంపీ టికెట్లు ఖరారు
- జిల్లా టీడీపీ శ్రేణుల్లో మిన్నంటిన సంబరాలు



కృష్ణప్రసాద్



బోడె ప్రసాద్..



కేశినేని చిన్ని

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో టీడీపీ పోటీచేసే ఒక ఎంపీ, 12 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను అధిష్ఠానం ఖరారు చేసింది. రెండు జిల్లాల్లో మొత్తం 2 ఎంపీ స్థానాలు, 14 ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయి. వీటిలో మచిలీపట్నం ఎంపీ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ స్థానాలను మిత్రపక్షాలైన బీజేపీ, జనసేనకు ఇచ్చారు. మిగిలిన విజయవాడ ఎంపీ స్థానంతో పాటు 12 అసెంబ్లీ స్థానాలకు టీడీపీ తన అభ్యర్థులను బరిలోకి దింపుతోంది. ఫిబ్రవరి 24న విడుదల చేసిన తొలి జాబితాలో 10 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా, శుక్రవారం విడుదల చేసిన రెండో జాబితాలో విజయవాడ పార్లమెంట్, మైలవరం, పెనమలూరు అసెంబ్లీ స్థానాలకు ఖరారు చేశారు. దీంతో టీడీపీ తన అభ్యర్థులందరినీ ప్రకటించినట్లయింది. విజయవాడ ఎంపీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్ (చిన్ని) బరిలో దిగుతున్నారు. పెనమలూరు అసెంబ్లీ స్థానం నుంచి బోడె ప్రసాద్, మైలవరానికి వసంత కృష్ణప్రసాద్ టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు.

వీడిన సస్పెన్స్

మైలవరం, పెనమలూరు నియోజకవర్గాల విషయంలో కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. మైలవరం నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి దేవినేని ఉమా పోటీ చేస్తారా, లేక వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు అవకాశం ఇస్తారా అనే విషయంపై ఇప్పటివరకు ఉత్కంఠ నెలకొంది. చివరికి టీడీపీ అధిష్ఠానం వసంతవైపే మొగ్గు చూపింది. అయితే, అధికారిక ప్రకటన వెలువడటంలో ఆలస్యం జరుగుతుండటంతో చివరికి ఏం జరుగుతుందోనన్న ఉత్సుకత కొనసాగింది. ఎట్టకేలకు మైలవరం నుంచి వసంత పేరు ఖరారైంది. పెనమలూరు విషయంలో హైడ్రామా నడిచింది. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయనకు ఈసారి సీటు ఇవ్వలేకపోతున్నామని అధినేత చంద్రబాబు పిలిచి చెప్పారు. దీంతో బోడెతో పాటు ఆయన అభిమానులు పార్టీ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ టికెట్ ఇవ్వకపోయినా చంద్రబాబు ఫొటో పెట్టుకుని పోటీ చేస్తానని బోడె ప్రకటించారు. మరోవైపు ఈ స్థానం నుంచి పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. దేవినేని ఉమాను ఇక్కడి నుంచి బరిలోకి దించుతారన్న ప్రచారం జరిగింది. ఆ తర్వాత మైనారిటీ అభ్యర్థిగా ఎంఎస్ బేగ్ పేరు తెరపైకి వచ్చింది. ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, తెలుగు యువత నాయకుడు దేవినేని చందుతో పాటు తెనాలి నియోజకవర్గ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరు కూడా వినిపించింది. చివరికి అన్ని ప్రచారాలకు చెక్ పెడుతూ బోడెవైపే టీడీపీ అధిష్ఠానం మొగ్గు చూపింది.

సీనియర్లకు సముచిత స్థానాలు

టీడీపీ ఈసారి బీజేపీ, జనసేనతో కలిసి ఎన్నికల బరిలోకి దిగుతుండటంతో పలువురు సీనియర్లకు ఈసారి న్యాయం చేయలేకపోయారు. అలాంటి వారిలో అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత మండలి బుద్ధప్రసాద్, మాజీమంత్రి దేవినేని ఉమా ఉన్నారు. ఉమాకు టికెట్ కేటాయించకపోవడం ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీకి వీర విధేయుడిగా ఉంటూ, చంద్రబాబు, లోకేశ్ మాట జవదాటని వ్యక్తిగా ఉమాకు పేరుంది. అలాంటి వ్యక్తికి ఈసారి టికెట్ ఇవ్వకపోవడం పార్టీ శ్రేణులను కాస్త నిరుత్సాహపరిచింది. పొత్తుల్లో భాగంగా అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించడంతో అక్కడ సీనియర్ నేత మండలి బుద్ధప్రసాద్‌కు టికెట్ దక్కలేదు. ఇక పెడన నుంచి టికెట్ ఆశించిన బూరగడ్డ వేదవ్యాస్‌కూ ఈసారి నిరాశే ఎదురైంది. అయితే, పార్టీ అధికారంలోకి వస్తే వీరి సేవలకు తగిన గుర్తింపు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు సమాచారం.

అన్నదమ్ముల సవాల్

విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్ (నాని) పోటీ చేస్తుండగా, ఆయనకు ప్రత్యర్థిగా టీడీపీ నుంచి ఆయన సోదరుడు కేశినేని శివనాథ్ (చిన్ని) పోటీ చేస్తున్నారు. దీంతో వీరి నడుమ పోటీ రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. 2014, 2019లో కేశినేని నాని టీడీపీ తరపున ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. ఆ సమయంలో అన్నకు అండగా ఉన్న చిన్ని.. ఇప్పుడు ప్రత్యర్థిగా బరిలో దిగుతున్నారు. ఈసారి చిన్ని గెలుపొందితే టీడీపీ విజయవాడ పార్లమెంటులో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసినట్లవుతుంది.



వైసిపి రంగులతో ఉన్న ట్రాక్టర్‌కు నామమాత్రంగా స్టిక్కర్‌లను అంటించిన అధికారులు

కోడ్ అమల్లోనూ వివక్షే

పసుపు రంగు తోపుడు బండ్లకు నల్లరంగు

- తాగునీటి ట్యాంకర్లపై వైసీపీ రంగులు యథాతథం



వెనిగండ్ల అందించిన తోపుడు బండ్లకు నల్లరంగు పూస్తున్న సచివాలయ సిబ్బంది

గుడివాడ : ఎన్నికల కోడ్ నిబంధనలు అమలులోనూ అధికారులు వివక్ష చూపుతున్నారు. అధికార పార్టీపై ప్రేమను చంపుకోలేకపోతున్నారు. గుడివాడలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడిచే మంచినీటి ట్యాంకర్‌లను చూస్తే అధికారుల తీరు ఇట్టే అర్థమవుతుంది.
చిన్నాచితక వ్యాపారాలు చేసుకునే పేదలకు బతుకుతెరువు నిమిత్తం వెనిగండ్ల ఫౌండేషన్ తోపుడు బండ్లను ఉచితంగా అందించింది. ఈ క్రమంలో తోపుడు బండికి శుభసూచకమైన పసుపురంగుతోపాటు ఫౌండేషన్ అధినేత పేరును వేయించారు. ఎన్నికల కోడ్ వస్తే సదరు బండ్లకు కేవలం పేర్లను, ఫోటోలను తొలగించాలి. కానీ సచివాలయ సిబ్బంది అత్యుత్సాహంతో మొత్తం తోపుడు బండికి నల్లరంగును పులిమేశారు.

అధికార పార్టీ అంటే ఎంత ప్రేమో

ప్రజాధనంతో నిర్వహించే మున్సిపల్ మంచినీటి ట్యాంకర్లకు అధికార వైసీపీ రంగులు వేసిన సంగతి విదితమే. మంచినీటి ట్యాంకర్ మొత్తం మూడు రంగులు వేయగా, కేవలం పేర్లు, ఫొటోలు మాత్రమే కనిపించకుండా చేశారు. మిగిలిన భాగంలో అధికార పార్టీ జెండా రంగులు స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులకు పట్టడం లేదు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-23 (శని)
సహర్ (ఉదయం) : 4-49 (ఆది)

రొయ్యూరులో ఇసుక దోపిడీ!

అర్ధరాత్రి అక్రమ రవాణా - 6లో..

రెండు లారీలు, ట్రాక్టర్‌ని పట్టుకున్న పోలీసులు

రామలింగేశ్వరునికి నాట్య నీరాజనాలు

- 6లో..



హౌస్‌హోల్డ్ రిజిస్టర్లు వెనక్కి

- స్పందించిన అధికారులు
- 60 శాతం పుస్తకాలు వాపస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుడివాడ : 'హౌస్‌హోల్డ్ రిజిస్టర్లు ఏవి?' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం కదిలింది. హౌస్‌హోల్డ్ రిజిస్టర్లు వెంటనే వెనక్కి తీసుకోవాలని గుడివాడ ఎన్నికల అధికారి పి.పద్మావతి హుటాహుటిన ఎంపీడీవోలకు, మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయాల అడ్మిన్లలో చలనం కలిగింది. వలంటీర్లకు ఫోన్‌లు చేసి హౌస్‌హోల్డ్ రిజిస్టర్లను వెంటనే వెనక్కి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అందుబాటులో ఉన్న వలంటీర్లు స్వయంగా రిజిస్టర్లను ఆయా సచివాలయాలకు తీసుకురాగా, మరికొందరు వేరే వారితో ఇచ్చి పంపించారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 60 శాతం మేర రిజిస్టర్లు వెనక్కి వచ్చినట్టు సమాచారం.

తాను ఒక జిల్లా అధికారిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి కూడా వైసీపీ కార్యకర్తగా ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) జయచంద్ర గాంధీ అధికార పార్టీకి బాకా మోగిస్తున్నాడు. వాట్సాప్ గ్రూపులలో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకన్నా ఎక్కువగానే రెచ్చిపోతున్నారు. తాజాగా పలు గ్రూపులలో జయచంద్ర గాంధీ పూర్వ చిట్‌చాట్‌లు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. ఒక జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేయాల్సిన ఈయన వైసీపీకి రాజకీయ శిష్యుడిగా, అంతకు మించి ప్రచారకర్తగా పనిచేస్తున్నాడు. ఆయన పలు వాట్సాప్ గ్రూపులలో తాను ఒక డీపీవో అన్న సంగతి మరిచిపోయి సాగించిన అనేక చిట్'చాట్'లు బయటకు వచ్చాయి. ఎవరైనా వైసీపీ నిర్ణయాలను ప్రశ్నించినా.. కామెంట్లు చేసినా డీపీవో గాంధీ వెంటనే స్పందిస్తారు. కౌంటర్లు ఇస్తారు. ప్రతిగా ఆయన రీ కౌంటర్లు ఇస్తున్నారు. వాట్సాప్ గ్రూపులలో జయచంద్ర గాంధీ సాగించిన చిట్ 'చాట్' బాగోతాలలో కొన్నింటిని చూద్దాం..

భజనచంద్ర.. చిట్ చాట్!

వాట్సాప్ గ్రూప్‌లలో వైసీపీకి బాకా

- పక్కా రాజకీయ లక్ష్యంతో పనిచేస్తున్న డీపీవో
- జగన్‌కు మద్దతుగా ప్రచారం..





వాట్సాప్ గ్రూపులో డీపీవో జయచంద్ర గాంధీ అధికార పార్టీకి అనుకూలంగా చేసిన పోస్టులివి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విశ్వసనీయతకు, మాటని తప్పని తత్వానికి జగన్ మారుపేరుగా తరచూ గ్రూపులలో చిట్‌చాట్ చేస్తుంటారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నెలకు రూ.3 వేల పెన్షన్ అందిస్తున్నారని చెబుతుంటారు. - మిగతా 6లో

కృష్ణా
●పెనమలూరు ● గన్నవరం

క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

ఉంగుటూరు, మార్చి 22 : క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్కూరు, ఉంగుటూరు ఎస్సైలు ఏ.ఫైడిబాబు, వి. రవి చంద్రకుమార్ హెచ్చరించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఐపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభమైన నేపథ్యంలో మండలంలో క్రికెట్ బెట్టింగ్‌లు జరుగకుండా ప్రత్యేక నిఘా వుంచామని తెలిపారు. ఇందులో భాగంగా గతంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తూ పట్టుబడిన వారిపై నిఘా ఏర్పాటు చేశామని, అనుమానిత ప్రాంతాల్లో కూడా పోలీస్ నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేశామని తెలిపారు. అమాయకుల బలహీనతలు ఆసరాగా చేసుకుని బెట్టింగ్ లకు పాల్పడినా, ప్రోత్సహించినా తీవ్రనేరంగా పరిగణిస్తామన్నారు. బెట్టింగ్ కూడా అత్యంత ప్రమాదకరమైన జూదం లాంటిదని, ఈ వ్యసనం అంటుకుంటే జీవితాలు నాశనమవడమే గాకుండా, కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

ఆస్తిపన్ను వసూళ్లలో నిర్లక్ష్యంపై ఆగ్రహం


సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు, మార్చి 22 : తాడిగడప మునిసిపాలిటీలో ఆస్తిప న్ను వసూళ్లలో నిర్లక్ష్యంపై మునిసిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వరరావు సిబ్బందిపై సీరియస్ అయ్యారు. శుక్రవారం నాలుగు సర్కిళ్ల ఆర్‌ఐలు, అడ్మిన్ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఈ నెలాఖరుకు పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ఆస్తి పన్నుల బకాయిలు ఎక్కువ మొత్తంలో ఉన్నందున సిబ్బంది వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలని నిర్దేశించారు.

గండిగుంటలో పారిశుధ్య కార్మికుల ధర్నా



గండిగుంట సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

గండిగుంట(ఉయ్యూరు), మార్చి 22 : గ్రామపంచాయతీల్లో పారిశుధ్య కార్మికుల ఏజెన్సీ కాంట్రాక్ట్ టెండర్ విధానం రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులకు కాంట్రాక్ట్ ఏజెన్సీ టెండర్ విధానం రద్దు చేసి వ్యక్తిగత టెండర్లు పిలిచి ప్రతి కార్మికుడికి రోజుకు కనీస వేతనం రూ.500 చెల్లించాలని డిమాండ్ చేస్తూ గండిగుంట గ్రామసచివాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. లక్ష్మి, నాగరాజు, రంగమ్మ, రాజేశ్వరి, నాగమణి, దానమ్మ, చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పైథాన్, సాఫ్ట్‌స్కిల్స్‌పై ముగిసిన వర్క్‌షాప్

ఉంగుటూరు, మార్చి 22 : మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపరచుకున్న విద్యార్థులకు అవకాశాలు అందివస్తాయని తేలప్రోలు ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం అన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ, నాంది ఫౌండేషన్ సహకారంతో స్థానిక కళాశాలలో పైథాన్, సాఫ్ట్‌స్కిల్స్‌పై బీటెక్ ఫైనలియర్ మహిళా విద్యార్థినులకు నిర్వహించిన రెండురోజుల వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. సాఫ్ట్‌స్కిల్స్‌ను నేర్చుకోవడం వల్ల ఇంటర్వ్యూలలో ఎలా వ్యవహరించాలనే అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.రాజశేఖ రరావు, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, సీఎస్ఈ అండ్ ఏఐ హెచ్‌వోడీ కేపీఎస్‌వీ సత్యశ్రీ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



జనావాసాల మధ్యే మురుగు!

- తాడిగడప మునిసిపాలిటీలోని ఖాళీస్థలాల్లో వెదజల్లుతున్న దర్గంధం
- అపార్టుమెంట్ల చెంతనే పెరిగిపోతున్న జమ్ము, తుంగ, పిచ్చిమొక్కలు
- దోమలు, విషపురుగుల విజృంభణతో అల్లాడిపోతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


కానూరులో పంటకాల్వ రోడ్డు వెంట ఖాళీస్థలంలో నిల్వ ఉన్న మురుగు

పెనమలూరు, మార్చి 22 : తాడిగడప మునిసిపాలిటీలోని నాలుగు క్లస్టర్లలో ఎక్కడ చూసినా ఖాళీస్థలాల్లో మురుగునీటి నిల్వలు, జమ్ము, తుంగ మొక్కలు పెరిగిపోతుండడంతో స్థానికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. కానూరు పంటకాల్వ రోడ్డు వెంట, తాడిగడప, యనమలకుదురు, కానూరు గ్రామాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో స్థానికులు దుర్గంధం భరించలేక నిత్యం ఇళ్లలో తలుపులు వేసుకొని ఉసూరుమంటున్నారు. అపార్టుమెంట్ల మధ్యన, ఆవాస ప్రాంతాల్లో మొక్కలు పెరిగిపోయి చిన్నపాటి అడవులను తలపించడంతో పాటు విషపురుగులకు ఆవాసాలుగా మారాయి. దీంతో స్థానికులు బెంబేలేత్తుతున్నారు.

అధికారులకు పట్టదా..!
మునిసిపాలిటీలో జనావాసాల మధ్య మురుగు, పిచ్చి మొక్కలు, పెరిగి జనజీవనానికి ఇబ్బంది కలుగుతుంటే మునిసిపల్ అధికారులకు పట్టదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దోమలు, విషపురుగుల విజృంభణతో స్థానికులు రోగాల పాలవుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో చెట్లు, పిచ్చి మొక్కలు, మురుగును ఎప్పటికప్పుడు శుభ్రం చేయించే బాధ్యత స్థలం సొంతదారులది అయినా, అధికారులు స్థలయజమానులను హెచ్చరించి వారితో స్థలాలను శుభ్రం చేయించే పనిని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థల యజమానుల కు జరిమానాలు విధించే అవకాశం అధికారులకు ఉన్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఖాళీ స్థలాల్లోని పిచ్చి మొక్కలు, మురుగు తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


తాడిగడప మునిసిపాలిటీలోని ఖాళీస్థలంలో పెరిగిన తుంగ, పిచ్చి మొక్కలు

బోడె ప్రసాద్‌కు టికెట్ ప్రకటనతో సంబరాలు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 22 : నిన్న మొన్నటి వరకు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు టీడీపీ అధిష్ఠానం టికెట్ నిరాకరించడంతో కొంత డీలాపడ్డ టీడీపీ శ్రేణులు శుక్రవారం బోడెకే టికెట్ ఖరారు చేయడంతో నూతనోత్సాహాన్ని ప్రదర్శించారు. శుక్రవారం ఉదయం పదిన్నరకు టీవీల్లో వచ్చిన వార్తలను చూసిన పార్టీ అభిమానులు, శ్రేణులు, బోడె అభిమానులు పోరంకిలోని టీడీపీ కార్యాలయానికి వచ్చి బోడె ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. పార్టీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొన్నారు. అనంతరం బోడె ప్రసాద్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేకును కోసి ఆనందాన్ని పంచుకొన్నారు. విషయం తెలుసుకొన్న తాడిగడప జనసేన అధ్యక్షుడు తాతపూడి గణేష్, సుధీర్‌లు అభినందనలు తెలిపారు. టీడీపీకి చెందిన వివిధ పదవుల్లో ఉన్న వ్యక్తులు బోడెకు అభినందలను తెలిపారు.

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడతాం
ఈడుపుగల్లు (కంకిపాడు) : ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను గెలిపించుకుంటామని, చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడతామని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. పెనమలూరు నియోజకవర్గ టికెట్ బోడె ప్రసాద్‌కు కేటాయించటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈడుపుగల్లులో నిర్వహిం చిన సంబరాల్లో సర్పంచ్ పందిపాటి ఇందిర, మాజీ సర్పంచ్ షేక్ మాబు సుబాని, షేక్ షకార్, పుట్టగుంట రవి, షైనేని దుర్గా భవాని, అనుమోలు రామకృష్ణ, కిలారు శ్రీనివాసరావు, సుధాకర్, సుంకర సుగణ, వీరపనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కంకిపాడు మండల పార్టీ కార్యాలయం వద్ద పార్టీ కార్యాలయ బాధ్యుడు బొప్పూడి శివరామకృష్ణ ఆధ్వర్యంలో భారీ ఎత్తున టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. చలవాది రాజ, రాజశేఖర్, అన్నే రామారావు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో స్థానిక టీడీపీ నాయకులు వణుకూరు విక్రం, కొలుసు గోవిందు, గుమ్మడి కిరణ్ కుమార్, దేవుడు పాల్గొన్నారు.

ఉయ్యూరులో..
ఉయ్యూరు : పెనమలూరు టికెట్ బోడె ప్రసాద్‌కు ప్రకటించడంతో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. చినఓగిరాలలో పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు ఆధ్వర్యంలో టపాసులు, కాల్చి స్వీట్లు పంచారు. ఉయ్యూరులో పలువురు పార్టీ నాయకులు టపాసులు కాల్చి బోడె ప్రసాద్‌ను కలిసి శుభా కాంక్షలు తెలిపేందుకు తరలివెళ్లారు. జబర్లపూడి, శాయిపురం సర్పంచ్‌లు సూరపనేని ప్రసాద్, జాన్‌బాషా, జయదేవ్, ఉయ్యూరు కౌన్సిలర్లు పలియాల శ్రీనివాసరావు, సుధారాణి, సలోమి సంతోషి, రమణతో పాటు పలువురు నాయకులు పోరంకి తరలివెళ్లి బోడెకు శుభాకాంక్షలు తెలిపారు.


ఈడుపుగల్లులో స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు


చినఓగిరాలలో కేక్ కట్ చేస్తున్న యెనిగళ్ల కుటుంబరావు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గన్నవరం, మార్చి 22 : విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నేపథ్యంలో గన్నవరం సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, ముది రాజుపాలెం గ్రామాల్లో సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నీటిపొదుపుపై అవగాహన


గండిగుంటలో నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గండిగుంట(ఉయ్యూరు), మార్చి 22 : ప్రాణకోటికి జీవనాధారమైన నీటిని పొదుపుగా వాడి వృథా చేయకుండా సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తెర గాలని ఉయ్యూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ అన్నారు. ప్రపంచ నీటిదినోత్సవం పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నీటి పొదుపుపై రైతులకు అవగాహన కల్పించేందుకు గండిగుంటలో శుక్రవారం క్షేత్రస్థాయిలో కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తు తరాలకు నీటి వనరులను సంరక్షించి అందిచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. క్లబ్ కార్యదర్శి నల్లా శ్రీనివాస్, క్లబ్ ప్రతినిధులు నెల్లి రాంబాబు, దినవహి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జలవనరులను పరిరక్షించుకోవాలి
హనుమాన్‌జంక్షన్‌రూరల్ : అత్యంత విలువైన జలవనరులను పరిరక్షిం చుకోకపోతే మానవాళి మనుగడే ప్రమాదం వాటిల్లుతుందని జల వనరులశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శ్రీనివాసరావు అన్నారు. రంగన్నగూడెంలో ఆర్ ఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జలవనరుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ, ప్రపంచంలోని జలాల్లో 97శాతం ఉప్పు నీరుగా సముద్ర జలాల రూపంలో వ్యాపించి ఉందని, మిగిలిన మూడు శాతంలో ఒకశాతం మాత్రమే ప్రజాఉపయోగార్థం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్‌డీఎస్ అధ్యక్షుడు తుమ్మల దశరథరామయ్య, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, హెచ్‌ఎం గ్లోరీ స్వర్ణలత, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మందపాటి రాంబాబు, పుసులూరి పూర్ణవెంకటప్రసాద్, లంకా రంగారావు, సత్యనారాయణ, బలరాం పాల్గొన్నారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

ఉయ్యూరు, మార్చి 22 : ఉయ్యూరు పట్టణ శివారు ప్రాంతంలో అక్రమంగా మద్యం సీసాలు కలిగిఉన్న కాగిత స్వామి వద్ద నుంచి శుక్రవారం పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్ తెలిపారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం


ఉయ్యూరు న్యాయాధికారితో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉయ్యూరు, మార్చి 22 : ఉయ్యూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్ తెలిపారు. కార్య దర్శిగా పల్లి అశోక్‌కుమార్, జనరల్ సెక్రటరీ జి శ్రీకృష్ణకు మార్, జాయింట్ సెక్రటరీ పి. శ్రీరామ్‌ప్రసాద్, ట్రెజరర్ లింగాల వసుధారాణి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ సీహెచ్ భాస్కరరావు, లైబ్రరియన్ కె గీతాంజలి, మహిళా కార్యదర్శిగా ఆర్ దివ్యాంజలి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు.

బూత్‌కు రాలేని వృద్ధులకు ఇంటివద్దే ఓటు

హనుమాన్‌జంక్షన్, మార్చి 22 : రానున్న ఎన్నికల్లో పోలింగ్ బూత్‌కు రాలేని 85 ఏళ్ల దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం ఇచ్చే విధంగా బూత్‌లెవల్ ఆఫీసర్లు పనిచేయాలని బాపులపాడు తహసీల్దార్ అంకం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌లెవల్ ఆఫీసర్లకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాపులపాడు, ఉంగుటూరు తహసీల్దార్లు అంకం శ్రీనివాస్, జేవీ సుబ్బారావు బూత్‌లెవల్ ఆఫీసర్లుకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వయో వృద్ధులు పోలింగ్‌బూత్‌కు రాలేని పక్షంలో వారి నుంచి ముందుగానే ఫారం 12డిని తీసుకోవాలని సూచించారు. బూత్ లెవల్‌లో ఉన్న వయోవృద్ధులు, దివ్యాంగుల జాబితాను తయారు చేసుకొని వారి నుంచి అభ్యర్థన పత్రాలు స్వీకరించి ఇంటే వద్దే ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్షలకు శిక్షణ

హనుమాన్‌జంక్షన్, మార్చి 22 : స్థానిక నూజివీడు రోడ్డులోని చైతన్యభారతి స్కూల్‌లో పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్న ట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.మురళీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి ఏప్రిల్ 26 తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కోచింగ్ ఫీజులు కట్టలేని పేద విద్యార్థులు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు.


కానుకలు లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు

అభయాంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.12.58 లక్షలు

హనుమాన్ జంక్షన్, మార్చి 22 : స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గడిచిన 71 రోజులకు గాను హుండీలో రూ.12,58,970లు ఆదాయం లభించినట్లు ఆలయ కార్య నిర్వాహ ణాధికారి ౬కె. శ్రీనివాస్ తెలిపారు. కానుకల లెక్కింపును ఏలూరు ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో సన్యాసిరావు పర్యవేక్షించారు. ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కానూరులో అన్నదానం



పెనమలూరు : కానూరులో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ పునర్నిర్మాణం విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శుక్రవారం 4000 మందికి అన్నదానం నిర్వహించారు. నన్నపనేని వేణుగోపాలరావు, ధనలక్ష్మి దంపతులు ఆలయానికి కంచుగంట, శిఖరం బహూకరించారు. తాళ్ల నరేంద్ర తాగునీరు ఏర్పాటు చేశారు.

వీరవల్లిలో గ్రామోత్సవం..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లిలోని తిరుపతమ్మ, గోపయ్యస్వామి తిరునాళ్లలో భాగంగా శుక్రవారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల మధ్య ప్రత్యేక పల్లకీలో ఊరేగుతూ తమ ఇంటి ముంగిటకు వచ్చిన తిరుపతమ్మ, గోపయ్యస్వామి వార్లకు గ్రామస్తులు హారతు లిచ్చి మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించారు. దేవస్థాన ట్రస్టీ నందమూరి మురళీ కృష్ణప్రసాద్, లంక రవిశ్రీనివాస్ పర్యవేక్షణలో కలపాల నాని, ఆత్కూరి బాలాజీ, బాబి, శ్రీకాంత్, గిరి పాల్గొన్నారు.









రొయ్యూరు ఎస్సీ సొసైటీ దగ్గర్లో ఇసుక రవాణాకు వేసిన రహదారి, ఇసుక తరలిస్తున్న టిప్పర్లు

రొయ్యూరులో అర్ధరాత్రి ఇసుక దోపిడీ!

- రెండు లారీలు, ట్రాక్టర్ పట్టుకున్న పోలీసులు

తోట్లవల్లూరు, మార్చి 22 : రొయ్యూరు క్వారీలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. పగలంతా జేసీబీలు, లారీలు ఖాళీగా పెట్టి అర్ధరాత్రి సమయంలో అక్రమాలకు తెరలేపుతున్నారు. గురువారం అర్ధరాత్రి రొయ్యూరు నుంచి ఇసుక లోడుతో వస్తున్న రెండు లారీలు, ఒక ట్రాక్టర్‌ను పోలీసులు కరకట్టపై పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ తర్వాత ఇసుక తవ్వకాలను అధికారులు నిలుపుదల చేసినా చీకటి దందా కొనసాగిస్తునే ఉన్నారు.

రెండు వర్గాల మధ్య వివాదం

రొయ్యూరు ఎస్సీ సొసైటీ వద్ద పాయలో పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుని రైతులకు కొంత సొమ్ము ఇచ్చాడు. ఇంతవరకు ప్రైవేటు క్వారీకి అనుమతి రాలేదు. అయితే జీసీకేసీ సంస్థ, మంత్రి జోగి రమేశ్ అనుచరులు ఇక్కడి పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు రెండు రోజుల క్రితం సన్నద్ధమయ్యారు. దాంతో ప్రైవేటు క్వారీకి దరఖాస్తు పెట్టుకున్న వ్యక్తి మంత్రి అనుచరులను అడ్డుకోవడంతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ వద్ద పంచాయితీ పెట్టారు. ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తున్నప్పటికీ ఒక వర్గం వారు రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా.. ప్రైవేటు క్వారీకి ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. మరో సంస్థ ఇసుక తవ్వకాలు చేపట్టడం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇసుక తోలకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

భజనచంద్ర చిట్‘చాట్’!

(5వ పేజీ తరువాయి)

గ్రూపులలో ఇతర పార్టీలపై అభిమానం ఉన్నవారు కూడా ఉంటారు. వారేదైనా తమకు అనుకూలంగా పోస్టు పెడితే డీపీవో జయచంద్ర గాంధీ సహించరు. కౌంటర్లు ప్లే చేస్తారు. తెలుగుదేశం, జనసేన పార్టీలపై బురదవేసే సెటైరికల్ వీడియోలను పోస్టు చేస్తారు. ఇలాంటి వాటిని చూసి సింహభాగం గ్రూపు సభ్యులు డీపీవోను భయంకరంగా ట్రోల్ చేస్తూ ఉంటారు. నువ్వు డీపీఓనా.. వైసీపీ కార్యకర్తవా అంటూ చెడుగుడు ఆడుతుంటారు. వైసీపీలో ఎంత అభివృద్ధి జరిగిందో తెలియచెప్పే వీడియోలను పోస్ట్ చేస్తారు. వీటితో పాటు ఇది కాదా అభివృద్ధి అంటూ వీడియోలు షేర్ చేస్తుంటారు. గతంలో కలెక్టర్ మందలించినా.. తలకెక్కించుకోకుండా.. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఇలాంటి రాజకీయ లక్ష్యం కలిగిన అధికారి జిల్లాలో ఉంటే.. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపించే ప్రమాదం కూడా ఉంది. ఈ అధికారి రాజకీయ లీలలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

పార్టీలోకి మారలేదని కక్ష గట్టి..

ఇంటి గోడ కూల్చివేత!

- జగ్గయ్యపేటలో వైసీపీ నేతల దాష్టీకం
- ఫోన్ చేసినా స్పందించని పోలీసులు, అధికారులు
- పైగా బాధితులపైనే ఎస్సీ అట్రాసిటీ ఫిర్యాదు

జగ్గయ్యపేట, మార్చి 22 : జగ్గయ్యపేటలో టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న కార్యకర్త పార్టీ మారలేదన్న కక్షతో ఇంటి గోడను కూల్చివేశారు. గత కొద్ది రోజులగా ఇంట్లోకి వెళ్లకుండా రాళ్ల అడ్డం పోసిన వ్యక్తులు శుక్రవారం ఏకంగా గోడను కూల్చారు. ఇంట్లో ఉన్న మోటారును ధ్వంసం చేశారు. పురపాలకసంఘం 30వ వార్డు పరిధిలో విజ్ఞాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ నాగుల్‌మీరా 20 సం.లకు పైగా పోరంబోకు భూమిలో ఇల్లు కట్టుకుని ఉంటున్నాడు. ఆయన సోదరుడు జాన్ సైదా టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ గత పురపాలకసంఘ ఎన్నికల్లో పోలింగ్ ఏజెంటుగా పనిచేశాడు. ఇటీవల జాన్‌సైదాను వార్డులో వైసీపీ నేతలు పార్టీ మారాలని ఒత్తిడి చేశారు. అందుకు అంగీకరించకపోవటంతో ఆయన సోదరుడి ఇంటి వద్ద వివాదాన్ని సృష్టించారు. ఆయన ఇంటికి వెళ్లే మూడు అడుగుల బాటలో నడవనీయకుండా రాళ్లు అడ్డం వేశారు. మహిళలు, పిల్లలు బయటకు రాకుండా భయభ్రాంతులకు గురిచేశారు. పురపాలక సంఘం అధికారులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదు. మునిసిపాలిటి టౌన్‌ప్లానింగ్ అధికారులు వచ్చి రాళ్లు తీయాలని మొక్కుబడిగా హెచ్చరించి వెళ్లారు. రాళ్లు తీయకపోగా శుక్రవారం ఏకంగా గడ్డపారలు తెచ్చి ఇంటి గోడను కూల్చేశారు. గోడ కూలి మోటార్ మీద పడటంతో పైపులైన్, మోటారు ధ్వంసమైంది. ఆ సమయంలో 100కి ఫోన్ చేసినా, స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసినా వస్తున్నామని చెప్పటం మినహా ఎవరూ స్పందించలేదని బాధితులు ఆరోపించారు. పురపాలకసంఘ అధికారులు బాధితులపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా అధికారులు అధికార పార్టీకి బానిసలుగానే వ్యవహరించారని విమర్శలు మూటగట్టుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఫోన్ చేసినా అధికారులు ఎన్నికల హడావుడిలో ఉన్నామంటు తప్పించుకునే ప్రయత్నం చేశారు. చివరకు బాధితులపై ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో కులం పేరుతో దూషించారని ఫిర్యాదు వచ్చిందని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. కేవలం తాను పార్టీ మారలేదనే అక్కసుతో తన సోదరుడు ఇంటి గోడను కూల్చారని, రెండు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న అక్కడ నుంచి బలవంతంగా ఖాళీ చేయించేందుకు ఇదంతా చేస్తున్నారని జాన్ సైదా ఆవేదన వ్యక్తం చేశారు. తన సోదరుడిని ఇంట్లో అన్నం తినేందుకు కూడా వెళ్లనివ్వలేదని, టీడీపీకి కట్టుబడి ఉండటమే తాము చేసిన నేరమని అన్నారు.



ఇంట్లోకి రాకపోకలులేకుండా అడ్డుగా వేసిన రాళ్లు

గోడ కూలుస్తున్న వైసీపీకి చెందిన వ్యక్తులు

రామలింగేశ్వరునికి నాట్య నీరాజనం

కూచిపూడి, మార్చి 22 : కూచిపూడి బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా మూడవ రోజైన శుక్రవారం పలువురు కళాకారులు నాట్యాంశాలు ప్రదర్శించి రామలింగేశ్వరునికి నాట్యనీరాజనాలు అందించారు. కూచిపూడి నాట్యాచార్యులు చింతా రవిబాలకృష్ణ నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన మోహిని భస్మాశుర నృత్య రూపం అబ్బుర పర్చింది. నాట్యాచారిణి బత్తిన సరిత శిష్య బృందం తక్కువేమి మనకు, రుక్మిణి ప్రవేశ దరువు అంశాలు ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని గావించారు. వేదాంతం కూచిపూడి కళాపరిషత్ దేవిభవాని శిష్య బృందం గణపతి స్తుతి, స్వాగతం కృష్ణ అంశాల్లో హావభావాలు ఆకట్టుకున్నాయి. వేదాంతం పార్థసారధి శిష్య బృందం చందన చర్చిత అష్టపది, గోపికృష్ణ అంశాలు ప్రదర్శించి కనువిందు చేశారు. సుష్మ ఉదయ్ మహంతి శిష్య బృందం కీర్తించు గణనాథుని, త్యాగరాజ కీర్తన అంశాలు ప్రదర్శించి మెప్పించారు. హైదరాబాద్‌కు చెందిన వీణ అయ్యర్ విశ్వేశ్వర ప్రవేశ దరువు అంశాన్ని ప్రదర్శించారు. దామెర్ల కనక విజయలక్ష్మి భరతముని నాట్య శాస్త్రంలోని అంశాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపచేశారు.



మహిషాసురమర్దిని నృత్య రూపకంలో కళాకారుల అభినయం

కార్యకర్త నుంచి నేతగా..

- సేవా కార్యక్రమాలతో జనంలోకి
- పార్టీకి విధేయుడిగా గుర్తింపు
- అధినేత, యువనేత మదిలో ప్రత్యేక స్థానం
- కేశినేని చిన్ని అనూహ్య ప్రస్థానం




(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

కేశినేని శివనాథ్ అలియాస్ చిన్ని ఏడాది క్రితం వరకు టీడీపీలో కొద్ది మందికి మాత్రమే తెలిసిన పేరు. కానీ ఏడాది నుంచి ఆయన పేరు విజయవాడ పార్లమెంటు ప్రజలకు సుపరిచితమైపోయింది. ఓవైపు సేవా కార్యక్రమాలతో జనం మదిలో చోటు సంపాదించుకుంటూనే మరోవైపు పార్టీని కష్టకాలంలో అన్నీ తానై ముందుకు నడిపించారు. ఈ అంశాలన్నీ ఆయన్ను విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో తిరుగులేని టీడీపీ నాయకుడిగా నిలబెట్టాయి.

పేరు	: కేశినేని శివనాథ్ (చిన్ని)
పుట్టిన తేదీ	: 3-8-1969
విద్యార్హత	: బీటెక్(మెకానికల్ ఇంజనీరింగ్)
వృత్తి	: రియల్ ఎస్టేట్, కేశినేని డెవలపర్స్ సీఈవో
తండ్రి	: రామస్వామి
తల్లి	: ప్రసూనాంబ
భార్య	: జానకీ లక్ష్మి
పిల్లలు	వెంకట్ చౌదరి, స్నిగ్ధ

కేశినేని చిన్ని 1994 నుంచి టీడీపీ కుటుంబ సభ్యుడిగా ఉన్నా సామాన్య కార్యకర్తగానే కొనసాగుతూ వచ్చారు. తన సోదరుడు కేశినేని నాని రాజకీయ ఎదుగుదలలో చిన్నిది కీలక పాత్ర. 2019లో ఎంపీగా గెలుపొందిన తర్వాత కేశినేని నాని శైలి మారిపోయింది. పార్టీ అధినేత చంద్రబాబుపైన, యువనేత లోకేశ్‌పైన పదే పదే నోరుజారడం.. బహిరంగంగానే పార్టీని విమర్శించడంతో పార్టీ నాయకులకు నానికి దూరం పెరుగుతూ వచ్చింది. నాని శైలిని జీర్ణించుకోలేకపోయిన చిన్ని సోదరుడితో విభేదించి ఆయనకు దూరమయ్యారు. ఆయనతోపాటే ఒకప్పుడు నానికి అత్యంత సన్నిహితులుగా ఉన్న టీడీపీ నాయకులు కూడా ఒక్కొక్కరుగా దూరమవుతూ వచ్చారు. వారందరిపైనా నాని నోరు పారేసుకునేవారు. నాని తీరుతో ఇబ్బందిపడుతున్న పార్టీ నాయకులు నెమ్మదిగా చిన్ని వైపు మొగ్గుచూపారు. క్రమంగా చిన్ని విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీకి పెద్దదిక్కుగా మారారు. ఒకప్పుడు తెరవెనుక రాజకీయాలకే పరిమితమైన చిన్ని ఏడాది కాలంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ పార్లమెంటు పరిధిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి నిర్వహిస్తున్నారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ప్రారంభించి నిత్యం మూడువేల మందికి అన్నదానం చేస్తున్నారు. వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందేలా చూస్తున్నారు. బసవతారకం ఇండో కేన్సర్ ఆసుపత్రి సహకారంతో అత్యంత ఖరీదైన కేన్సర్ పరీక్షలు మొబైల్ మెడికల్ వ్యాన్ ద్వారా మారుమూల పల్లెల్లోనూ ఉచితంగా చేయిస్తున్నారు. కృష్ణానది తీరాన ఉండి కూడా సరైన నీటి సౌకర్యం లేకపోవడంతో ఎ.కొండూరు గిరిజన ప్రాంతంలోని ప్రజలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. సుమారు 500 మందికిపైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందజేస్తున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ విజయవాడ పార్లమెంటు పరిధిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించడంలో చిన్ని తనదైన ముద్ర వేశారు. యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రను జయప్రదం చేయడంలోనూ చిన్ని కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ చిన్నిని విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దింపింది.

కుటుంబసభ్యులతో..





టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో కేశినేని చిన్ని, సౌమ్య

వైసీపీ నియంత పాలనపై తిరుగుబాటు

- కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు

విద్యాధరపురం, మార్చి 22 : వైసీపీ నియంతృత్వ పాలన పట్ల ప్రజలు, ప్రజా ప్రతినిధులు మూకుమ్మడిగా తిరగబడుతున్నారని విజయవాడ టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నందిగామకు చెందిన పలువురు వైసీపీ నేతలకు టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని తంగిరాల సౌమ్యతో కలిసి కేశినేని చిన్ని కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ, నందిగామలో వైసీపీ నుంచి టీడీపీలోకి వందలాదిగా చేరడం విప్లవాత్మక పరిణామమని పేర్కొన్నారు. త్వరలోనే నందిగామ వైసీపీ ఖాళీ అవుతుందని ఈ పరిణామాలు సాంకేతాన్ని ఇస్తున్నాయన్నారు. నందిగామ 9వ వార్డు వైసీపీ కౌన్సిలర్ విశ్వనాథపల్లి వాణి, మాజీ ఎంపీటీసీ ప్రత్తిపాటి జయరామరావు, వైసీపీ ఇన్‌చార్జ్ కృపారావు, ఆతోటి నాగరాజు, ఇంద్రకంటి కాశీ తదితరులు టీడీపీలో చేరారు.

రానున్నది ఎన్డీయే ప్రభుత్వమే..

అజిత్‌సింగ్‌నగర్ : రానున్నది ఎన్డీయే ప్రభుత్వమే అని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే కూటమికి ప్రజలు పట్టం కడతారని తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో శుక్రవారం జరిగిన సెంట్రల్ బీజేపీ సర్వసభ్య సమావేశానికి కేశినేని చిన్ని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశాభివృద్ధిని కాంక్షించే మోదీ, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు తపించే చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. సెంట్రల్ ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమా, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్(చిన్ని) పేరును పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రకటించడంపై సెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం పైపులరోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కేశినేని చిన్నికి ఘన స్వాగతం పలికి స్వీట్లు పంచిపెట్టారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, పరుచూరి ప్రసాద్‌లు, దాసరి కనకారావులు కేశినేని చిన్నికి అభినందనలు తెలిపారు.



పురిటిపాడులో వృద్ధులతో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము

గుడివాడను అభివృద్ధి పథంలో నడిపిస్తా : వెనిగండ్ల

గుడ్లవల్లేరు, మార్చి 22 : గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని వచ్చా.. ఇక్కడి ప్రజల ఆదరణ ఆనందాన్నిస్తోంది. ఎంత కష్టమైనా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నిలిపి అభివృద్ధి చేసి చూపిస్తా.. అని గుడివాడ నియోజకవర్గ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం పురిటిపాడు, చినగొన్నూరు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ భవిషత్ గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్న రాము మాట్లాడుతూ, రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. పురిటిపాడు, చినగొన్నూరు గ్రామాల్లో వెనిగండ్లకు ఘన స్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కొసరాజు బాపయ్య చౌదరి, సీఎల్ వెంకట్రావు, జిల్లాపరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ శాయిన పుష్పావతి, కాగిత నరేంద్ర, జయప్రసాద్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు పాల్గొన్నారు.

విశాఖను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిన జగన్ : రవీంద్ర



మచిలీపట్నం టౌన్, మార్చి 22 : గంజాయి, డ్రగ్స్ రవాణాలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపి, విశాఖను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేసిన సీఎం జగన్‌రెడ్డికి రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదని మాజీ మంత్రి, ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రెజిల్ కంటైనర్‌లో రూ. కోట్ల విలువగల డ్రగ్స్‌ను పట్టుకుంటే.. రాష్ట్ర పోలీసులు ఎందుకు అడ్డుపడ్డారో సమాధానం చెప్పాలన్నారు. బ్రెజిల్ ప్రధానికి వైసీపీ నేత పూనం పూర్ణచంద్రరావు ట్విట్టర్‌లో ట్విట్ చేసిన సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. చంద్రబాబు విశాఖపట్నంను ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దితే.. జగన్ డ్రగ్స్ రాజధానిగా మార్చారన్నారు. పూనం పూర్ణచంద్రరావుకు విజయసాయిరెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. డ్రగ్స్ మాఫియా వల్ల యువత భవిత ఛిద్రమవుతోందన్నారు. డ్రగ్స్ రాకెట్‌లో చంద్రబాబు, లోకేశ్‌లకు సంబంధం ఉందని వైసీపీ నేతలు బురద చల్లడం సిగ్గుచేటన్నారు.

గంజాయి రాష్ట్రంగా మార్చిన జగన్ : దేవినేని ఉమా



గొల్లపూడి : ఒకప్పుడు దేశం మొత్తానికి బియ్యం ఎగుమతి చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ నేడు జగన్ రెడ్డి పాలనలో దేశం మొత్తానికి గంజాయి సరఫరా చేస్తూ గంజాయిప్రదేశ్‌గా మారిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. గొల్లపూడిలో ఆయన శుక్రవారం రాత్రి విలేకర్లతో మాట్లాడుతూ.. బ్రెజిల్ దేశ అధ్యక్షుడికి విజయసాయిరెడ్డి శుభాకాంక్షలు ఎందుకు తెలియజేశారు ప్రాంతీయ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి బ్రెజిల్ అధ్యక్షుడికి ఏం సంబంధాలు ఉన్నాయో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో యువత ఉద్యోగాలు, ఉపాధి లేక మత్తుకు బానిసలై నాలుగేళ్లలో 1,745 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. డ్రగ్స్ సరఫరాపై సీబీఐ విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

పామర్రులో 'బ్రెజిల్ కంటైనర్' కలకలం

పామర్రు, మార్చి 22 : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విశాఖలో సీబీఐకి చిక్కిన బ్రెజిల్ కంటైనర్ వ్యవహారం కృష్ణాజిల్లా పామర్రులో కలకలం రేపింది. పామర్రు పరిధిలోని మచిలిపట్నం-విజయవాడ జాతీయరహదారిపై కురుమద్దాలి వద్ద గల సంధ్య ఆక్వా సంస్థలో కూడా సోదాలు జరుగుతాయని స్థానికులు భావించినా.. శుక్రవారం రాత్రి వరకు అటువంటిది జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాకినాడ సమీపంలో గల సంధ్యా ఆక్వా సంస్థలపై సీబీఐ బృందాలు సోదాలు చేస్తున్నాయనే సమాచారంతో కురుమద్దాలిలో కూడా సోదాలు జరగవచ్చనే చర్చ స్థానికంగా కలకలం రేపింది.



కురుమద్దాలిలో ఉన్న సంధ్య ఆక్వా కర్మాగారం



ఎన్నికల నియమావళి అమలుపై వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జేసీ తదితరులు

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు : దిల్లీరావు

వన్‌టౌన్, మార్చి 22 : అధికారుల సమన్వయంతో జిల్లాలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు చెప్పారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలపై శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుంచి జేసీ సంపత్ కుమార్, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు బీహెచ్ భవానీశంకర్, కె.మాధవి, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి దిల్లీరావు పాల్గొన్నారు. జిల్లాలో 42 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పనిచేస్తున్నాయని, సీ విజిల్ ద్వారా ఈనెల 21 వతేదీ వరకు 109 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

ఒక పటిష్ట ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టర్ దిల్లీరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రిటర్నింగ్ అధికారుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీ-విజిల్, 1950 హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్, కలెక్టరేట్ కంట్రోల్ రూం తదితరాల ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి రిటర్నింగ్ అధికారులు, వివిధ విభాగాల నోడల్ అధికారులకు పలు సూచనలు చేశారు.

పార్టీలోకి మారలేదని కక్ష గట్టి..

ఇంటి గోడ కూల్చివేత!

- జగ్గయ్యపేటలో వైసీపీ నేతల దాష్టీకం
- ఫోన్ చేసినా స్పందించని పోలీసులు, అధికారులు
- పైగా బాధితులపైనే ఎస్సీ అట్రాసిటీ ఫిర్యాదు

జగ్గయ్య పేట, మార్చి 22 : జగ్గయ్యపేటలో టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న కార్యకర్త పార్టీ మారలేదన్న కక్షతో ఇంటి గోడను కూల్చివేశారు. గత కొద్ది రోజులుగా ఇంట్లోకి వెళ్లకుండా రాళ్లు అడ్డం పోసిన వ్యక్తులు శుక్రవారం ఏకంగా గోడను కూల్చారు. ఇంట్లో ఉన్న మోటారును ధ్వంసం చేశారు. పురపాలకసంఘం 30వ వార్డు పరిధిలో విజ్ఞాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ నాగుల్‌మీరా 20 సం.లకు పైగా పోరంబోకు భూమిలో ఇల్లు కట్టుకుని ఉంటున్నాడు. ఆయన సోదరుడు జాన్ సైదా టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ గత పురపాలకసంఘ ఎన్నికల్లో పోలింగ్ ఏజెంటుగా పనిచేశాడు. ఇటీవల జాన్‌సైదాను వార్డులో వైసీపీ నేతలు పార్టీ మారాలని ఒత్తిడి చేశారు. అందుకు అంగీకరించకపోవటంతో ఆయన సోదరుడి ఇంటి వద్ద వివాదాన్ని సృష్టించారు. ఆయన ఇంటికి వెళ్లే మూడు అడుగుల బాటలో నడవనీయకుండా రాళ్లు అడ్డం వేశారు. మహిళలు, పిల్లలు బయటకు రాకుండా భయభ్రాంతులకు గురిచేశారు. పురపాలక సంఘం అధికారులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదు. మునిసిపాలిటి టౌన్‌ప్లానింగ్ అధికారులు వచ్చి రాళ్లు తీయాలని మొక్కుబడిగా హెచ్చరించి వెళ్లారు. రాళ్లు తీయకపోగా శుక్రవారం ఏకంగా గడ్డపారలు తెచ్చి ఇంటి గోడను కూల్చేశారు. గోడ కూలి మోటార్ మీద పడటంతో పైపులైన్, మోటారు ధ్వంసమైంది. ఆ సమయంలో 100కి ఫోన్ చేసినా, స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసినా వస్తున్నామని చెప్పటం మినహా ఎవరూ స్పందించలేదని బాధితులు ఆరోపించారు. పురపాలకసంఘ అధికారులు బాధితులపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా అధికారులు అధికార పార్టీకి బానిసలుగానే వ్యవహరించారని విమర్శలు మూటగట్టుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఫోన్ చేసినా అధికారులు ఎన్నికల హడావుడిలో ఉన్నామంటు తప్పించుకునే ప్రయత్నం చేశారు. చివరకు బాధితులపై ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో కులం పేరుతో దూషించారని ఫిర్యాదు వచ్చిందని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. కేవలం తాను పార్టీ మారలేదనే అక్కసుతో తన సోదరుడు ఇంటి గోడను కూల్చారని, రెండు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న అక్కడ నుంచి బలవంతంగా ఖాళీ చేయించేందుకు ఇదంతా చేస్తున్నారని జాన్ సైదా ఆవేదన వ్యక్తం చేశారు. తన సోదరుడిని ఇంట్లో అన్నం తినేందుకు కూడా వెళ్లనివ్వలేదని, టీడీపీకి కట్టుబడి ఉండటమే తాము చేసిన నేరమని అన్నారు.



ఇంట్లోకి రాకపోకలులేకుండా అడ్డుగా వేసిన రాళ్లు



గోడ కూలుస్తున్న వైసీపీకి చెందిన వ్యక్తులు

రామలింగేశ్వరునికి నాట్య నీరాజనం

కూచిపూడి, మార్చి 22 : కూచిపూడి బాలాత్రిపు సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా మూడవ రోజైన శుక్రవారం పలువురు కళాకారులు నాట్యాంశాలు ప్రదర్శించి రామలింగేశ్వరునికి నాట్యనీరాజనాలు అందించారు. కూచిపూడి నాట్యాచార్యులు చింతా రవిబాలకృష్ణ నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన మోహిని భస్మాశుర నృత్య రూపం అబ్బుర పర్చింది. నాట్యాచారిణి బత్తిన సరిత శిష్య బృందం తక్కువేమి మనకు, రుక్మిణి ప్రవేశ దరువు అంశాలు ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని గావించారు. వేదాంతం కూచిపూడి కళాపరిషత్ దేవిభవాని శిష్య బృందం గణపతి స్తుతి, స్వాగతం కృష్ణ అంశాల్లో హావ భావాలు ఆకట్టుకున్నాయి. వేదాంతం పార్థసారథి శిష్య బృందం చందన చర్చిత అష్టపది, గోపికృష్ణ అంశాలు ప్రదర్శించి కనువిందు చేశారు. సుష్మ ఉదయ్ మహంతి శిష్య బృందం కీర్తించు గణనాథుని, త్యాగరాజ కీర్తన అంశాలు ప్రదర్శించి మెప్పించారు. హైదరాబాద్‌కు చెందిన వీణ అయ్యర్ విశ్వేశ్వర ప్రవేశ దరువు అంశాన్ని ప్రదర్శించారు. దామెర్ల కనక విజయలక్ష్మి భరతముని నాట్య శాస్త్రంలోని అంశాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపచేశారు.



మహిషాసురమర్దిని నృత్య రూపకంలో కళాకారుల అభినయం

కార్యకర్త నుంచి నేతగా..

- సేవా కార్యక్రమాలతో జనంలోకి
- పార్టీకి విధేయుడిగా గుర్తింపు
- అధినేత, యువనేత మదిలో ప్రత్యేక స్థానం
- కేశినేని చిన్ని అనూహ్య ప్రస్థానం



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

కేశినేని శివనాథ్ అలియాస్ చిన్ని ఏడాది క్రితం వరకు టీడీపీలో కొద్ది మందికి మాత్రమే తెలిసిన పేరు. కానీ ఏడాది నుంచి ఆయన పేరు విజయవాడ పార్లమెంటు ప్రజలకు సుపరిచితమైపోయింది. ఓవైపు సేవా కార్యక్రమాలతో జనం మదిలో చోటు సంపాదించుకుంటూనే మరో వైపు పార్టీని కష్టకాలంలో అన్నీ తానై ముందుకు నడిపించారు. ఈ అంశాలన్నీ ఆయన్ను విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో తిరుగులేని టీడీపీ నాయకుడిగా నిలబెట్టాయి.

పేరు	: కేశినేని శివనాథ్ (చిన్ని)
పుట్టిన తేదీ	: 3-8-1969
విద్యార్హత	: బీటెక్(మెకానికల్ ఇంజనీరింగ్)
వృత్తి	: రియల్ ఎస్టేట్, కేశినేని డెవలపర్స్ సీఈవో
తండ్రి	: రామస్వామి
తల్లి	: ప్రసూనాంబ
భార్య	: జానకీ లక్ష్మి
పిల్లలు	వెంకట్ చౌదరి, స్నిగ్ధ

కేశినేని చిన్ని 1994 నుంచి టీడీపీ కుటుంబ సభ్యుడిగా ఉన్నా సామాన్య కార్యకర్తగానే కొనసాగుతూ వచ్చారు. తన సోదరుడు కేశినేని నాని రాజకీయ ఎదుగుదలలో చిన్నిది కీలక పాత్ర. 2019లో ఎంపీగా గెలుపొందిన తర్వాత కేశినేని నాని శైలి మారిపోయింది. పార్టీ అధినేత చంద్రబాబుపైన, యువనేత లోకేశ్‌పైన పదే పదే నోరుజారడం.. బహిరంగంగానే పార్టీని విమర్శించడంతో పార్టీ నాయకులకు నానికి దూరం పెరుగుతూ వచ్చింది. నాని శైలిని జీర్ణించుకోలేకపోయిన చిన్ని సోదరుడితో విభేదించి ఆయనకు దూరమయ్యారు. ఆయనతోపాటే ఒకప్పుడు నానికి అత్యంత సన్నిహితులుగా ఉన్న టీడీపీ నాయకులు కూడా ఒక్కొక్కరుగా దూరమవుతూ వచ్చారు. వారందరిపైనా నాని నోరు పారేసుకునేవారు. నాని తీరుతో ఇబ్బందిపడుతున్న పార్టీ నాయకులు నెమ్మదిగా చిన్ని వైపు మొగ్గుచూపారు. క్రమంగా చిన్ని విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీకి పెద్దదిక్కుగా మారారు. ఒకప్పుడు తెరవెనుక రాజకీయాలకే పరిమితమైన చిన్ని ఏడాది కాలంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ పార్లమెంటు పరిధిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి నిర్వహిస్తున్నారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ప్రారంభించి నిత్యం మూడువేల మందికి అన్నదానం చేస్తున్నారు. వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందేలా చూస్తున్నారు. బసవతారకం ఇండో కేన్సర్ ఆసుపత్రి సహకారంతో అత్యంత ఖరీదైన కేన్సర్ పరీక్షలు మొబైల్ మెడికల్ వ్యాన్ ద్వారా మారుమూల పల్లెల్లోనూ ఉచితంగా చేయిస్తున్నారు. కృష్ణానది తీరాన ఉండి కూడా సరైన నీటి సౌకర్యం లేకపోవడంతో ఎ.కొండూరు గిరిజన ప్రాంతంలోని ప్రజలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. సుమారు 500 మందికిపైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందజేస్తున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ విజయవాడ పార్లమెంటు పరిధిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించడంలో చిన్ని తనదైన ముద్ర వేశారు. యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రను జయప్రదం చేయడంలోనూ చిన్ని కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ చిన్నిని విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దింపింది.



కుటుంబసభ్యులతో..

రొయ్యూర్యరులో అర్ధరాత్రి ఇసుక దోపిడీ!

- రెండు లారీలు, ట్రాక్టర్ పట్టుకున్న పోలీసులు

తోట్లవల్లూరు, మార్చి 22 : రొయ్యూరు క్వారీలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. పగలంతా జేసీబీలు, లారీలు ఖాళీగా పెట్టి అర్ధరాత్రి సమయంలో అక్రమాలకు తెరలేపుతున్నారు. గురువారం అర్ధరాత్రి రొయ్యూరు నుంచి ఇసుక లోడుతో వస్తున్న రెండు లారీలు, ఒక ట్రాక్టర్‌ను పోలీసులు కరకట్టపై పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ తర్వాత ఇసుక తవ్వకాలను అధికారులు నిలుపుదల చేసినా చీకటి దందా కొనసాగిస్తునే ఉన్నారు.

రెండు వర్గాల మధ్య వివాదం

రొయ్యూరు ఎస్సీ సొసైటీ వద్ద పాయలో పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుని రైతులకు కొంత సొమ్ము ఇచ్చాడు. ఇంతవరకు ప్రైవేటు క్వారీకి అనుమతి రాలేదు. అయితే జీసీకేసీ సంస్థ, మంత్రి జోగి రమేశ్ అనుచరులు ఇక్కడి పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు రెండు రోజుల క్రితం సన్నద్ధమయ్యారు. దాంతో ప్రైవేటు క్వారీకి దరఖాస్తు పెట్టుకున్న వ్యక్తి మంత్రి అనుచరులను అడ్డుకోవడంతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ వద్ద పంచాయితీ పెట్టారు. ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తున్నప్పటికీ ఒక వర్గం వారు రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా.. ప్రైవేటు క్వారీకి ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. మరో సంస్థ ఇసుక తవ్వకాలు చేపట్టడం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇసుక తోలకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.





రొయ్యూరు ఎస్సీ సొసైటీ దగ్గర్లో ఇసుక రవాణాకు వేసిన రహదారి, ఇసుక తరలిస్తున్న టిప్పర్లు

వసంత నివాసంలో సంబరాలు

- తరలివచ్చిన మైలవరం, నందిగామ కార్యకర్తలు
- టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరినీ కలుస్తా : వసంత
- దేవినేని, బొమ్మసాని నా గెలుపునకు కృషి చేస్తారన్న నమ్మకం ఉంది

నందిగామ, మార్చి 22: మైలవరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా టిక్కెట్ దక్కించుకున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు నందిగామలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం మూడవ జాబితాలో మైలవరానికి వసంత పేరును చంద్రబాబు ఖరారు చేయడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి ఐతవరంలోని ఆయన నివాసానికి వస్తున్న కృష్ణప్రసాద్‌కు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. మైలవరం, నందిగామకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఐతవరంలోని వసంత నివాసం కిక్కిరిసింది. టీడీపీ టిక్కెట్టు దక్కించున్న కృష్ణప్రసాద్ తన తండ్రి వసంత నాగేశ్వరరావు పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తనపై నమ్మకంతో టిక్కెట్ ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తాను తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు కూడా స్వాగతిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థిగా తాను మైలవరం నుంచి భారీ మెజారిటీతో గెలవబోతున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు ఇప్పటికే తనతో మాట్లాడుతూనే ఉన్నారని, ఒకరిద్దరు దూరంగా ఉన్నా తాను వారిని కలుస్తానని చెప్పారు. పార్టీ నిర్ణయాన్ని ఆ నేతలు వ్యతిరేకించరన్న నమ్మకం తనకుందన్నారు. సీటు ఆశించిన బొమ్మసాని సుబ్బారావుతో తాను ఫోన్‌లో మాట్లాడానని, త్వరలో ఆయన్ను కలుస్తానని చెప్పారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా, ప్రతిపక్ష నేతగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు పట్ల తనకు వ్యక్తిగత వైరం లేదని, ఆయన కూడా పార్టీ గెలుపుకోసం కృషిచేస్తారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఉన్న నేతలను కూడా తాను వ్యక్తిగతంగా కలుస్తానన్నారు.



ఐతవరం నివాసంలో వసంత కృష్ణప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

వసంత బయోడేటా

పేరు	: వసంత వెంకటకృష్ణప్రసాద్
పుట్టిన తేదీ	: 09-04-1970
తండ్రి	: వసంత నాగేశ్వరరావు, మాజీ మంత్రి
గ్రామం	: నందిగామ మండలం, ఐతవరం
కుటుంబ నేపథ్యం	: రాజకీయం
వృత్తి	: పారిశ్రామిక వేత్త, రియల్‌ఎస్టేట్.
భార్య	: శిరీష, గృహిణి
పిల్లలు	: ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి

వసంత రాజకీయ ప్రస్థానం..

ఐతవరం గ్రామానికి చెందిన మాజీ వసంత నాగేశ్వరరావు కుమారుడు కృష్ణప్రసాద్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా అంచలంచలుగా ఎదిగారు. తొలిసారి 1999లో కాంగ్రెస్ పార్టీ తరఫున నందిగామ ఎమ్మెల్యే పదవికి పోటీ చేసి దేవినేని ఉమా చేతిలో ఓటమి పాలయ్యారు. 2004లో వసంత నాగేశ్వరరావు పోటీచేసి దేవినేని ఉమా చేతిలో స్వల్పతేడాతో ఓటమి పాలయ్యారు. 2009లో నందిగామ సీటు ఎస్సీలకు రిజర్వ్ కావడంతో ఆ ఎన్నికలలో పోటీ చేయలేదు. అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్న కృష్ణప్రసాద్ 2014 ఎన్నికలలో టీడీపీలో చేరారు. చంద్రబాబు సూచనలతో ఆయన నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఎన్నికల తరువాత పార్టీకి దూరంగా ఉంటూ వచ్చిన ఆయన అనూహ్యంగా వైసీపీలో చేరి మైలవరంలో దేవినేని ఉమాపై విజయం సాధించారు. జగన్ పాలన, పార్టీలో అంతర్గత పోరుతో విసుగు చెందిన ఆయన ఇటీవల టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన ఆయనకు చంద్రబాబు తిరిగి మైలవరం టిక్కెట్ ఇచ్చారు.



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న విచారణ అధికారి శ్రీనివాసరావు

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై విచారణ

అవనిగడ్డ, మార్చి 22 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారంటూ అవనిగడ్డ ఈవోపీఆర్డీ శైలజాకుమారిపై వచ్చిన ఆరోపణలపై ఆర్వో బాలసుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి కె.శ్రీనివాసరావు శుక్రవారం విచారణ చేపట్టారు. ఈవోపీఆర్‌డిపై ఫిర్యాదు చేసిన అవనిగడ్డ మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, మరో ఐదుగురిని ఎంపీడీవో కార్యాలయానికి పిలిపించి విచారించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి ఈవోపీఆర్డీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, గతంలోనూ ఆమె అధికార పార్టీకి అనుకూలంగా పనిచేశారని వివరించారు. విచారణ అనంతరం నివేదికను ఆర్వోకు అందజేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

మంచినీటి సరఫరాకు ఏర్పాట్లు

వన్‌టౌన్ : వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ దిల్లీరావు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ జే.సునీతతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంచినీటి సరఫరాపై జిల్లాలో పరిస్థితిని వివరించారు. తిరువూరు, గంపలగూడెం పరిధిలో తాగునీటికి సంబంధించి ఉపాధి పనుల కల్పనకు తీసుకున్న చర్యలను ప్రధానకార్యదర్శికి వివరించారు. జలవనరుల శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మునిసిపల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు.

భజనచంద్ర చిట్'చాట్'!

(5వ పేజీ తరువాయి)

గ్రూపులలో ఇతర పార్టీలపై అభిమానం ఉన్నవారు కూడా ఉంటారు. వారేదైనా తమకు అనుకూలంగా పోస్టు పెడితే డీపీవో జయచంద్ర గాంధీ సహించరు. కౌంటర్లు ప్లే చేస్తారు. తెలుగుదేశం, జనసేన పార్టీలపై బురదవేసే సెటైరికల్ వీడియోలను పోస్టు చేస్తారు. ఇలాంటి వాటిని చూసి సింహభాగం గ్రూపు సభ్యులు డీపీవోను భయంకరంగా ట్రోల్ చేస్తూ ఉంటారు. నువ్వు డీపీఓనా.. వైసీపీ కార్యకర్తవా అంటూ చెడుగుడు ఆడుతుంటారు. వైసీపీలో ఎంత అభివృద్ధి జరిగిందో తెలియచెప్పే వీడియోలను పోస్ట్ చేస్తారు. వీటితో పాటు ఇది కాదా అభివృద్ధి అంటూ వీడియోలు షేర్ చేస్తుంటారు. గతంలో కలెక్టర్ మందలించినా.. తలకెక్కించుకోకుండా.. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఇలాంటి రాజకీయ లక్ష్యం కలిగిన అధికారి జిల్లాలో ఉంటే.. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపించే ప్రమాదం కూడా ఉంది. ఈ అధికారి రాజకీయ లీలలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

ఎన్నికల నిఘా బృందాలు అప్రమత్తంగా ఉండాలి

పామర్రు : ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు తావు ఇవ్వకుండా ఎన్నికల నిఘా బృందాలు విధులు నిర్వర్తించాలని అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.శ్రీదేవి ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆమె ఎన్నికల నిఘా బృందాలతో సమావేశం నిర్వహించారు. ద్విచక్ర, ఇతర వాహనాల్లో రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు తీసుకెళ్తే సరైన పత్రాలు చూపించకపోతే ఆ నగదు సీజ్ చేయాలన్నారు. సీజ్ చేసిన నగదు రూ.10 లక్షలులోపు ఉంటే జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జమ చేయాలన్నారు. రూ.10లక్షల కంటే ఎక్కువ నగదు ఉంటే ఇన్‌కంటాక్స్ నోడల్ అధికారి కార్యాలయంలో జమచేయాలన్నారు. ప్రచార హోర్డింగ్‌లు,ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



పెడన, పామర్రులో భద్రతా దళాల కవాతు

పెడన : ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేయడానికి అనువైన వాతావరణం కల్పిస్తామని ఇన్‌చార్జి డీఎస్పీ రమేష్‌బాబు తెలిపారు. ఎన్నికలను పురస్కరించుకుని మచిలీపట్నం పోలీసు సబ్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికలు శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా జరిపేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఓటర్లను బెదిరించినా, ప్రలోభపెట్టినా, అల్లర్లు సృష్టించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా కఠిన దండన విధిస్తామని ఆయన హెచ్చరించారు. సీఆర్‌పీఎఫ్ దళాలు కవాతులో పాల్గొన్నాయి. సీఐకె. నాగేంద్రప్రసాద్, ఎస్సై సూర్యశ్రీనివాస్, బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను ఎస్సై పాల్గొన్నారు. **పామర్రు :** ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, రాజకీయ నేతలు సహకరించాలని పామర్రు ఎస్సై పి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి కోరారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ లక్మేందర్‌సింగ్, ఎస్సై అనురాగ్ కౌశిక్‌లు కేంద్ర బలగాలతో పామర్రులో కవాతు నిర్వహించారు. పౌరులు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఏఎస్సైలు రాజ్‌కుమార్, వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీకేఆర్ ఫెస్ట్ ప్రారంభం



వీకేఆర్‌ఫెస్ట్ - 2024 ప్రారంభించి మాట్లాడుతున్న లగడపాటి వీరాంజనేయులు

గుడివాడ : వీకేఆర్ ఫెస్ట్-2024 విద్యార్థుల సృజనాత్మకతను, సాంకేతికత ప్రతిభను చాటడానికి చక్కటి వేదిక అని లియో గ్లోబల్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ లగడపాటి వీరాంజనేయులు అన్నారు. వీకేఆర్ ఫెస్ట్- 2024ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మొదటి రోజు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పోకు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు, వీకేఆర్ విద్యార్థులు 850 మంది పాల్గొన్నారు. సైన్స్ ఎక్స్‌పో, ఆటపాటలు, వినోదం, ఫుడ్‌కు సంబంధించి 30 స్టాళ్లను ఏర్పాటు చేశారు. శనివారం షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్, ఫొటోగ్రఫీ, ఫొటోషాప్ ఎడిట్, మాక్‌ప్రెస్, ఇన్‌స్టా రీల్స్, జనరల్ అండ్ టెక్నికల్ క్విజ్ అంశాలు జరుగుతాయి. కల్చరల్ విభాగంలో డ్యాన్స్, పాటల పోటీ, ఫ్యాషన్ షో, మిమిక్రీ పోటీలు జరుగుతాయి, కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ .ఎస్.హెచ్.వి ప్రసాదరావు, ఫెస్ట్ కన్వీనర్ కొల్లపర దుర్గాప్రసాద్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.




రాజుపేటలో పర్యటిస్తున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర
బాబు ష్యూరిటీలో పి.వి.ఫణికుమార్
జోగానందరావు కాలనీలో చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న కాగిత

వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారు

● ఇంటింటి ప్రచారంలో కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 22 : వైసీపీ ప్రభుత్వ అవినీతి, అక్రమ విధానాల పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు , టీడీపీ నాయకులతో కలిసి ఆయన 36, 37, 39 డివిజన్లలో ఇంటింటికీ పర్యటించారు. వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారన్నారు. తాను అధికారం లోకి వస్తే కరెంటు కాలనీ వాసుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మురికివాడల ప్రజలకు స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామన్నారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇప్పటికీ ప్రభుత్వం ఇవ్వలేకపోయారన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్, కార్యదర్శి పిప్పళ్ళకాంతారావు, కట్టా దుర్గ , మరకాని పరబ్రహ్మం , చిన్ని , గుమ్మడి విద్యాసాగర్, కార్పొరేటర్లు దింటకుర్తి సుధాకర్, దేవరపల్లి అనిత, తెలుగు యువత నియోజక వర్గ అధ్యక్షుడు సలీం, కాసాని భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

శిడింబి అగ్రహారంలో బాబు ష్యూరిటీ

మచిలీపట్నం టౌన్ : బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శిడింబి అగ్రహారంలో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి పి.వి. ఫణికుమార్, డివిజన్ అధ్యక్షుడు గంజాల రవికుమార్ ఇంటింటికీ పర్యటించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రాజధానిపై స్పష్టత లేని పాలకులకు ఓటును అడిగే హక్కు ఉందా అని ప్రశ్నించారు.

చేనేతను నిర్లక్ష్యం చేసిన వైసీపీ

పెడన : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయిందని, ఫలితంగా కార్మికులు ఉపాధి కోల్పోయి అవస్థలు పడుతున్నారని పెడన నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. చేనేత కార్మికులు ఎక్కువగా నివసిస్తున్న 7, 8 వార్డులలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎనిమిదో వార్డులోని జోగానందరావు కాలనీలో కృష్ణప్రసాద్ చేనేత పనులు చేసి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. చేనేత కార్మికులకు అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా రద్దు చేసిందని దుయ్యబట్టారు. సర్వనాశనమైన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో పయనింప చేయగల సత్తా, సమర్థత ఒక్క చంద్రబాబు నాయుడుకే ఉన్నాయన్నారు. టీడీపీ నాయకులు బొడ్డు వేణుగోపాలరావు, సాదరబోయిన ఏడుకొండలు, యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయూం, ఊటుకూరి మోహనరావు, హమీదుల్లా, కమ్మగంటి బాబు, పరసా సూర్యనారాయణ, బెజవాడ నాగరాజు, జనసేన పార్టీ నాయకులు మట్టా శివపావని, వరుదు రాము, నాని, పత్తిపాటి జయకృష్ణ, బీజేపీ నాయకులు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కొల్లూరి రాధాకృష్ణ గుప్తా పాల్గొన్నారు.



ఐక్యంగా పోరాడుదాం : కుమార్ రాజా

పామర్రు : ఐక్య పోరాటంతో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్లకుమార్ రాజా అన్నారు. పాలశీతల కేంద్రం హాలు లో నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన నేతల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ మాట్లాడుతూ దుష్టపరిపాలనను అంత మొందించడానికి మూడు పార్టీల కలవడం రాష్ట్రానికి శుభపరిణామమన్నారు. బీజేపీ కార్యదర్శి పోలాన ఆశోక్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమన్నారు. అనంతరం నాయిబ్రాహ్మణ సంఘ నేతల సమన్వయ సమావేశంలో కూమార్‌రాజా పాల్గొన్నారు. కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, వల్లూరిపల్లి గణేష్, ఐదు మండలాల బీసీ నేతలు పాల్గొన్నారు.

మిత్ర ధర్మాన్ని పాటించండి

అవనిగడ్డ : తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తు లో భాగంగా అన్ని పార్టీల నేతలు మిత్ర ధర్మాన్ని పాటించాలని నియోజకవర్గ జనసేన నేతలు విజ్ఞప్తి చేశారు.

అవనిగడ్డలో జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2014 నుంచి జనసేన పార్టీ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గాన్ని జనసేన పార్టీకి కేటాయించారని, కొందరు టీడీపీ నేతలు మిత్ర ధర్మాన్ని విస్మరించి టీడీపీకి సీటు కేటాయించాలని కోరుతున్నారన్నారు. మరి కొందరు జనసేన పార్టీ ఓటమి చెందుతుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. ఇది సరైంది కాదన్నారు. ఉమ్మడి అభ్యర్థిని గెలిపించేందుకు అంతా ఒక తాటిపైకి వచ్చి కృషి చేయాలని కోరారు. జిల్లా సమన్వయకమిటీ సభ్యులు చెన్నగిరి సత్యనారాయణ, లంకే యుగంధర్, ఉస్మాన్ షరీఫ్, గుడివాక శేషుబాబు, వెంకటేశ్వరరావు, మత్రే గంగయ్య, పూషడపు రత్నగోపాల్, ఎస్.విమల్ కృష్ణ, బొప్పన భాను, నెరుసు సాయి భార్గవ్, తుంగల నరేష్, చందు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ వాహనాలపై జగన్ బొమ్మల మూసివేత



అవనిగడ్డ, మార్చి 22 : ఎన్నికల నియమావళిలో భాగంగా మండలంలో ఇంటింటికి రేషన్ అందించే ఎండీయూ వాహనాలపై ఉన్న సీఎం జగన్మోహన్‌రెడ్డి బొమ్మలను రెవెన్యూ సిబ్బంది మూసివేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి మూడు రోజులు పూర్తైనా గ్రామాల్లో తిరిగే ఎండీయూ వాహనాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బొమ్మను అలాగే ఉంచి నాణ్యమైన బియ్యం పంపిణీ చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుండటంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో అధికారులు ముఖ్యమంత్రి బొమ్మపై స్టిక్కర్లు అంటించి మూసివేశారు. ఎండీయూ వాహనాలపై రాతలను పూర్తిగా మూసివేయాలని టీడీపీ నేత యాసం చిట్టిబాబు అధికారులకు విజ్ఞప్తి చేశారు.



ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల సందర్శన


రుస్తుంబాద పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

మచిలీపట్నం టౌన్, మార్చి 22 : విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రుస్తుంబాదా మునిసిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సమాధానాలకు చిరునవ్వులు చిందిస్తూ చప్పట్లతో అభినందించారు. ప్రవీణ్ ప్రకాష్ వచ్చినప్పటినుంచి ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకున్న విద్యాశాఖాధికారులు ఆయన చిరునవ్వులు చిందించడంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మికంగా పాఠశాలను సందర్శించారు. అరగంట ముందుగా విద్యాశాఖాధికారులు పాఠశాలకు వచ్చి ప్రవీణ్ ప్రకాష్ వస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణకు చెప్పారు. ఏ తరగతిని సందర్శిస్తారో, ఏమి అడుగుతారో ఎవరికీ తెలియదు. రాగానే తొమ్మిదో తరగతికి వెళ్దామని చెప్పడంతో ప్రవీణ్ ప్రకాష్ తోపాటు కేంద్ర బృందానికి చెందిన ఆశిష్ కుమార్ సక్సేనా, హోం ఎఫైర్స్ డిప్యూటీ సెక్రటరీ హరీష్ చంద్ర, ఆర్జేడీ నాగమణి , పరీక్షల విభాగం పరిశీలకులు శ్రీనివాసులురెడ్డి, డీఈవో తాహేరా సుల్తానా, ఎంఈవో దుర్గాప్రసాద్ వెళ్లారు. పాఠాలు ఎలా అభ్యసిస్తున్నారో ప్రశ్నించారు. ఒక పాఠాన్ని టీచర్ పుష్పకుమారిని అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న స్కిల్ ట్రైనీ పాఠాలు బోధించే విధానాన్ని వివరించారు. విద్యార్థులకు ట్యాబ్‌లపై పాఠాలు అర్థమవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అందరూ ఆంగ్ల భాషలోనే పాఠాలకు జవాబులు చెప్పడంతో ప్రవీణ్ ప్రకాష్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణను అభినందించారు. **పెదపారుపూడి :** విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వానపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. విద్యాబోధన గురుంచి విద్యార్థులను అడిగి తెలుసు బోధనను పరిశీలించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు.

అద్దంకి నాంచారమ్మ హుండీ ఆదాయం రూ.1.65 లక్షలు

కోడూరు, మార్చి 22 : విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ ఆలయ హుండీలను శుక్రవారం దేవదాయ అధికారి కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో శుక్రవారం లెక్కించారు. 72 రోజులకు గానూ రూ.1,65,407 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కె.సుధాకర్ తెలిపారు. కొండవీటి వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

పెడన రూరల్ : ఆధునిక టెక్నాలజీని విద్యార్థులు అం దిపు చ్చుకోవాలని నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాం డెంట్ కాకి కుమార్ బాబు అన్నారు. వారం రోజులుగా కళాశాలలో సేల్స్ ఫోర్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన 36 మంది ప్రొఫెసర్స్, అధ్యాపకులు , విద్యార్థులకు అవగాహనా తరగతులు నిర్వహించారు. చెన్నై ఐసీటీ కంపెని ప్రతినిధి ఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ బిఆర్‌ఎస్ రెడ్డి, దోసపాటి బాబా, శ్యామ్‌ప్రసాద్, అహ్మద్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు విశ్రాంత సీఎస్ మాధవరావు విరాళం

చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. జనవరిలో జరిగిన స్వచ్ఛ చల్లపల్లి మూడు వేల రోజుల వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛ చల్లపల్లికి తనవంతు సహకారం అందిస్తున్న మాధవరావు శుక్రవారం లక్ష రూపాయల విరాళాన్ని ఆన్‌లైన్ ద్వారా పంపించారు. స్వచ్ఛ కార్యకర్తల తరపున మాధవరావుకు చల్లపల్లి రథసారథి డాక్టర్ డి.ఆర్కే.ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా సునీల్ కుమార్

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా ఎం.సునీల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మండల పరిస్థితులను ఆయన సిబ్బందితో చర్చించారు. డిప్యూటీ తహసీల్దార్ కనక దుర్గ, ఆర్ఐ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆశీల వసూలు ఆదాయం రూ.16.0 5లక్షలు

అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ ఆదాయం రూ.2.30 లక్షల మేర పెరిగింది. రోజు వారి ఆశీలు వసూలుకు వేలం పాట నిర్వహించారు. ఆరుగురు పాటదారులు ఒక్కొక్కరు ఐదు లక్షల రూపాయల చొప్పున డిపాజిట్ చేసి పాటలో పాల్గొనగా, హెచ్చు పాటదారునిగా కొండవీటి పవన్ కుమార్ రూ.16 లక్షల 5 వేలకు పాటను కైవసం చేసుకున్నాడు. గతేడాది 13.75 లక్షలు పాట రాగా, ఈ ఏడాది రూ.2.30 లక్షల అధిక ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

భూహక్కు చట్టాన్ని నిరసిస్తూ బహిరంగ సభ 25న

చల్లపల్లి : పేద, మధ్య తరగతి రైతాంగం హక్కులను కాలరాసే 'ఆంధ్రప్రదేశ్ భూమి హక్కు యాజమాన్య చట్టం-2023ను వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జె.జగన్ కోరారు. ఈ నెల 25న చల్లపల్లి సెంటర్‌లోని సంపటాలమ్మ గుడి వద్ద బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభకు వక్తలుగా రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ, జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, జిల్లా కార్యదర్శి యు.వీరబాబు హాజరవుతారని తెలిపారు. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జగన్ విజ్ఞప్తి చేశారు.

జరుగు వెంకటేశ్వరరావుకు నివాళి



కోడూరు : కోడూరు మాజీ ఉప సర్పంచ్ జరుగు వెంకటేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ తదితరులు ఘన నివాళులర్పించారు. జరుగు వెంకటేశ్వరరావు మరణం టీడీపీకి తీరని లోటు అన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, దేవనబోయిన వెంకటేశ్వరరావు, పిల్లి మల్లిఖార్జునరావు, మేడా శివాజీ, కడవకొల్లు నాంచారయ్య, గోగినేని సోమశేఖరరావు, ఉప్పాల పోతురాజు, యర్రంశెట్టి దామోదర్, వేములపల్లి శ్రీకృష్ణ, బొడ్డు వెంకన్న, మత్రే గంగయ్య, కాగిత రామారావు, బడే వీరబాబు, బడే గాంధీ, పెద్ది భాస్కరరావు, మాచర్ల భీమయ్య, కోట రాంబాబు, బండే ఆంజనేయులు, నాగ తాతయ్య, పరిశె నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం

కూచిపూడి : బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం విశేష పూజలు, యాగశాల ప్రవేశం, పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, వాస్తు పూజ, వాస్తు హోమం, కలశ స్థాపన, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణతోపాటు ఉత్సవ మూర్తులను గ్రామపుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఓటు హక్కుపై అవగాహన

గుడివాడ రూరల్ : ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. ఓటు హక్కుపై వ్యవసాయ శాఖ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు వినియోగించుకునేటప్పుడు మంచి వ్యక్తి, చక్క టి పరిపాలన తెలిసిన వ్యక్తిని ఎన్నుకోవాలని కోరారు. ఏవో అనంతలక్ష్మి తదిరతులు పాల్గొన్నారు. **ఘంటసాల :** రైతులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల సూచించారు. కొడాలి రైతు భరోసా కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో కె.మురళీకృష్ణ, విఏఏ వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ

నాగాయలంక : ఎదురుమొండి దీవుల్లోని ఆరు పోలింగ్ బూత్‌లను అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.బాలసుబ్రహ్మణ్యం, అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్‌తో కలసి శుక్రవారం తనిఖీ చేశారు. ఎదురుమొండిలోని -2, గొల్లమంద, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ, కృష్ణాపురంలో ఒక్కొక్క బూత్‌ను పరిశీలించి వసతులపై అధికారులతో తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, అవనిగడ్డ సీఐ త్రినాథ్, నాగాయలంక ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారి సనకా జనార్ధన్, వీఆర్వో మేడికొండ భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక ఎన్నికలకు కృషి

పెడన : ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరమణ సూచించారు. రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడవద్దన్నారు. మత సామరస్యాన్ని దెబ్బతీసే ప్రసంగాలు చేయకూడదన్నారు. యక్కల శ్యామలయ్య, యర్రా నాగరాజు, బండారు మల్లిఖార్జునరావు, పుప్పాల వాసు, అప్పారావు, పుప్పాల రాము పాల్గొన్నారు.



